

సిద్దిపేటలోని ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ సెంటర్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్



సిద్దిపేట ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ సెంటర్‌లో టేబుళ్లను ఏర్పాటు చేస్తున్న అధికారులు, సిబ్బంది



ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ సెంటర్ వద్ద అధికారులు, సిబ్బంది

- సిద్దిపేటలోని ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- ముందుగా దుబ్బాక ఫలితం
- ఆలస్యంగా గజ్వేల్ నియోజకవర్గ ఫలితం
- జిల్లాలో 83.06శాతం పోలింగ్ నమోదు
- నాలుగు నియోజకవర్గాల్లో 14 టేబుళ్ల ఏర్పాటు
- పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు

## మరికొన్ని గంటల్లో తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

# నేడు కౌంటింగ్.. అందరిలో ఉత్కంఠ




సిద్దిపేట ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలలో హుస్నాబాద్ నియోజకవర్గానికి కేటాయించిన సీ బ్లాక్

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 2 : అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ గురువారం ముగియగా, నేడు ఓట్ల లెక్కింపు ఉండడంతో అభ్యర్థుల భవితవ్యం తేలనున్నది. సిద్దిపేట జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియను జిల్లాకేంద్రంలోని ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఉదయం 8గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానున్నదని, ముందుగా పోస్టల్ బ్యా లెట్ ఓట్లను లెక్కించనున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు.

### అన్ని ఏర్పాట్లు పూర్తి..

ఓట్ల లెక్కింపునకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ముం దుగా దుబ్బాక ఫలితం వెల్లడయ్యే అవకాశం ఉంది. అభ్యర్థులు ఎక్కువ మంది ఉన్నందున గజ్వేల్ నియోజకవర్గ ఫలి తం ఆలస్యంగా వెల్లడయ్యే అవకాశం ఉంది. జిల్లాలో 9,48,664 మంది ఓటర్లు ఉండగా.. 7,87,889 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 83.05 శాతం పోలింగ్ నమోదైంది.

### కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి..

ఆదివారం (నేడు) సిద్దిపేటలోని ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలలో జరగనున్న కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. హుస్నాబాద్ నియోజవర్గానికి సంబంధించి ఓట్లు లెక్కింపునకు 'సీ' బ్లాక్, గజ్వేల్ నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపునకు 'ఈ' బ్లాక్, సిద్దిపేట నియోజకవర్గానికి 'డీ' బ్లాక్, దుబ్బాక నియోజవర్గానికి 'ఏ' బ్లాక్‌లను సిద్ధం చేశారు. శనివారం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్, పోలీస్ కమిషనర్ శ్వేత ఏర్పాట్లను పర్యవేక్షించారు. కౌంటింగ్ కోసం పోలీసులు మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రాన్ని సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించనున్నారు. అదే విధంగా కౌంటర్లు, పొలిటికల్ పార్టీ సభ్యుల సిట్టింగ్, ఆర్‌వో క్యాబిన్ ఏర్పాటు, వాహనాల పార్కింగ్, బారికేడ్ల ఏర్పాటు, మీడియా పాయింట్ తదితర ఏర్పాట్లను కలెక్టర్, సీపీ శ్వేత పరిశీలించారు. కౌంటింగ్ సెంటర్లు ఉన్న ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాల పరిసరాలతో పాటు జిల్లావ్యాప్తంగా నేడు 144 సెక్షన్ అమలులో ఉండనుంది.




ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలలో గజ్వేల్ నియోజకవర్గానికి కేటాయించిన ఈ బ్లాక్

### జిల్లాలో 83.05 పోలింగ్ శాతం నమోదు

సిద్దిపేట జిల్లాలో మొత్తం 83.05 పోలింగ్ శాతం నమోదైంది. జిల్లాలో 9,48,664 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 7,87,889 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో 2,42,177 ఓట్లకు 2,05,017 ఓట్లు పోల్ కావడంతో 84.66 పోలింగ్ శాతం నమోదైంది. సిద్దిపేట నియోజవర్గంలో 2,33,733 ఓట్లకు.. 1,78,420 ఓట్లు పోలై.. 76.33 పోలింగ్ శాతం నమోదైంది. దుబ్బాక నియోజవర్గంలో 1,98,100 ఓట్లకు.. 1,73,366 ఓట్లు పోల్ కాగా.. 87.51 పోలింగ్ శాతం నమోదైంది. గజ్వేల్ నియోజకవర్గంలో 2,74,654 ఓట్లకు ..2,31,086 ఓట్లు పోలై 84.14 పోలింగ్ శాతం నమోదైంది.



ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ సెంటర్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

### ముందుగా దుబ్బాక.. ఆలస్యంగా గజ్వేల్ ఫలితం

సిద్దిపేట జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ఆదివారం (నేడు) జరగనున్నది.

- హుస్నాబాద్ నియోజకవర్గం(32)లో 304 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. 22 రౌండ్లలో ఫలితం తేలనున్నది.
- సిద్దిపేట(33) నియోజకవర్గంలో 273 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. 14 టేబుళ్లు ఏర్పాటు చేసి.. 20 రౌండ్లలో ఫలితం తేలనున్నది.
- దుబ్బాక(41) నియోజకవర్గంలో 253 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. 19 రౌండ్లలో ఫలితం తేలనున్నది.
- గజ్వేల్(42)లో నియోజకవర్గంలో 321 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. 14 టేబుళ్లు ఏర్పాటు చేయగా.. 23 రౌండ్లలో ఫలితం తేలనున్నది. 19 రౌండ్లు మాత్రమే ఉండడంతో దుబ్బాక ఫలితం ముందుగా వెల్లడయ్యే అవకాశం ఉంది. అభ్యర్థులు ఎక్కువగా ఉండడంతో పాటు పోలింగ్ కేంద్రాల సంఖ్య ఎక్కువగా ఉండడంతో గజ్వేల్ ఫలితం ఆలస్యంగా వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

### బరిలో 95 మంది అభ్యర్థులు

జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో మొత్తం 95మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అత్యధికంగా గజ్వేల్ నియోజకవర్గం నుంచి 44మంది అభ్యర్థులు పోటీచేశారు. అత్యల్పంగా దుబ్బాక నియోజకవర్గం నుంచి 11మంది అభ్యర్థులు మాత్రమే పోటీలో ఉన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో 21మంది అభ్యర్థులు, హుస్నాబాద్ నియోజకవర్గంలో 19మంది పోటీలో ఉన్నారు. వీరందరి భవితవ్యం నేడు తేలనున్నది.



ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు




ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలలో సిద్దిపేట నియోజకవర్గానికి కేటాయించిన డీ బ్లాక్



కౌంటింగ్ సెంటర్ల వద్ద బారికేడ్లను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది